రావణ బ్రహ్మపై ఊరేగిన ముక్తిరామలింగేశ్వరుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి గంగాగౌరి సమేత ముక్తిరామలింగేశ్వరుడు రావణ బ్రహ్మ హవాహనంపై ఊరేగాడు. వేకువజామున సైకత లింగానికి, రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు చేసి అలంకరించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పూలతో, ఆభరణలతో అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు సామూహికంగా కుంకుమార్చన ఆచరించారు.

ఆసుపత్రి మూత.. రోగులకు వెత

అట్లూరు : మండల కేంద్రమైన అట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సాయంత్రం అయితే చాలు తాళం వేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పేరుకేమో 24 గంటలు 5 పడకల ఆసుపత్రి. సరిపడా సిబ్బంది ఉన్నారు. అయినా సాయంత్రం అయ్యేసరికి విధులను మరిచి తాళం వేసి వెళుతున్నారని పలువురు వాపోతున్నారు. అట్లూరు గ్రామానికి చెందిన బోవిళ్ల జయమ్మకు విరేచనాలు అవుతుండటంతో హుటాహుటిన ఆమె మరిది బోవిళ్ల కృష్ణారెడ్డి శనివారం ఆసుపత్రికి తీసుకెళ్లాడు. ఆసుపత్రికి తాళం వేసి ఉండటంతో ఆయన చేసేది లేక వైద్యం కోసం కడపకు వెళ్లాల్సి వచ్చింది. ఇకనైనా ఆసుపత్రి నిత్యం తెరిచి ఉండేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు అభివృద్ధి పనులు ప్రారంభం

గోపవరం : మండలంలో పూర్తయిన పలు అభివృద్ధి పనులను ఆదివారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోపవరం మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఉదయం 9–30 గంటలకు చిన్నగోపవరం సచివాలయం వద్ద ఉచిత కంటి వైద్యశిబిరం, 10–30 గంటలకు రాచాయపేట రైతు భరోసా కేంద్రం, 11 గంటలకు రాచాయపేట నుంచి బుచ్చనపల్లె వరకు రూ.1.83 కోట్లతో నిర్మించిన రింగ్‌రోడ్డు, టీ.సంద్రపల్లె విలేజ్‌క్లినిక్ నూతన భవనాలను ఎమ్మెల్సీ ప్రారంభిస్తారని ఆయన తెలిపారు.

ఈ ప్రభుత్వంలోనే మాకు మేలు జరిగింది


ప్రొద్దుటూరు:మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


చాపాడు : పల్లవోలులో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి


బద్వేలు:ప్రభుత్వంపై అభిప్రాయాన్ని అడుగుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లుతో ప్రజలు

ప్రొద్దుటూరు : గత ప్రభుత్వాలతో పోల్చితే ఈ ప్రభుత్వంలోనే తమ కుటుంబాలకు చాలా మేలు జరిగిందని పలువురు పేదలు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డికి వివరించారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని 28వ వార్డులో ఉన్న మునెయ్య కొట్టాలు వీధుల్లో శనివారం ఎమ్మెల్యే రాచమల్లు పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి పేదలతో మాట్లాడారు. మీ కుటుంబానికి ఈ ప్రభుత్వంలో ఏఏ సంక్షేమ పథకాలు అందాయి, వాటిని కొనసాగించాలా.. వద్దా, గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి తేడా ఉందా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పేద కుటుంబాల వారు మాట్లాడుతూ తమకు వైఎస్సార్ భరోసా పథకం ద్వారా పింఛన్ అందుతోందని, జగనన్న అమ్మ ఒడి ద్వారా తమ పిల్లలకు చదువు కోసం రూ.15వేలు ఇస్తున్నారని, వైఎస్సార్ ఆసరా ద్వారా తమకు డ్వాక్రా రుణాలు మాఫీ అయ్యాయని తెలిపారు. వలంటీర్ల వ్యవస్థ ద్వారా మీకు మేలు జరుగుతోందా అని ఎమ్మెల్యే అడుగగా చాలా సౌకర్యవంతంగా ఉందని ప్రజలు తెలిపారు. ఆయా కుటుంబాలు మద్దతు తెలిపిన అనంతరం వారి ఇంటి తలుపునకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్‌ను, మొబైల్ ఫోన్‌కు స్టిక్కర్ అతికించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, వార్డు కౌన్సిలర్ పాతకోట మునివంశీధర్‌రెడ్డి, పద్మశాలీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, మాజీ కౌన్సిలర్ శౌరి సుభాష్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

99 శాతం మంది ప్రజలకు మంచి చేశాము
– ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

చాపాడు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో ప్రతి గ్రామంలో 99 శాతం మంది ప్రజలకు మంచి చేశామని మైదుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. మండలంలోని పల్లవోలు గ్రామంలో శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు రమణయ్య, ప్రసాద్, మనోహర్ ఆధ్వర్యంలో ×నువ్వే మా నమ్మకం జగన్÷ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలతో నేరుగా మాట్లాడారు. ప్రతి ఇంటి వద్ద వారి ఇష్టం మేరకు సీఎం వైఎస్ జగన్ స్టిక్కర్లను అంటించారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు చెప్పిన హామీల్లో 95 శాతం నెరవేర్చి, ప్రతి గ్రామంలో 99 శాతం మంది ప్రజలకు తమ ప్రభుత్వం మంచి చేసిందన్నారు. ప్రజల మద్దతు కోరేందుకు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి వస్తుంటే ఓర్వలేక టీడీపీ నాయకులు విమర్శలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లక్షుమయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ రామమోహన్‌రెడ్డి, నాయకులు నారాయణరెడ్డి, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగనే సీఎం

ఖాజీపేట : ఎన్నికలు ఎప్పుడు జరిగినా వైఎస్ జగన్‌ను మరోసారి సీఎంను చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. ఖాజీపేట టౌన్ అగ్రహారం గ్రామంలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు మండల నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను వివరించారు. జనం ఇష్టం మేరకు వారి ఇళ్లకు జగన్ ఫొటోతో ఉన్న స్టిక్కర్‌ను అంటించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో టీడీపీ పాలనలో జరిగిన సంక్షేమ ఫలాల కంటే నేడు సీఎం జగన్ చేస్తున్న మేలు చాలా బాగుందని ప్రతి లబ్ధిదారుడు అంటున్నాడని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మేలు జరిగిందని ఆయన వివరించారు.

పసుపు పంట కొనుగోలు చేస్తాం

పసుపు పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే అన్నారు. అందుకే సీఎంతో మాట్లాడి పసుపు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ గోపాల్‌రెడ్డి, సర్పంచులు పెద్దిరెడ్డి, బుజ్జి, అగ్రహారం జంగిటి శివ పాల్గొన్నారు.

కాశినాయనలో..

కాశినాయన : జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా శనివారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డి, జెడ్పీటీసీ సత్యనారాయణరెడ్డిలు మండలంలోని రెడ్డికొట్టాల, చెన్నవరం గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, సచివాలయ కన్వీనర్లు లక్ష్మీదేవి, రామకృష్ణారెడ్డి, మాబు, బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నోటా జగనన్నే మా భవిష్యత్తు
– ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

బద్వేలు : ఏ ఇంటికి వెళ్లినా ప్రజలు జగనన్నే మా భవిష్యత్తు అంటున్నారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. శనివారం పోరుమామిళ్ల మండలంలోని సచివాలయం-3 పరిధిలో ఆయన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టార్ స్కూల్ సమీపంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అనంతరం ప్రభుత్వంపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. సెల్‌ఫోన్, ఇంటి గోడలపై వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఫొటోలు ఉన్న స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ హయాంలో పథకాలు నోటి మాటలుగా మాత్రమే అమలయ్యాయన్నారు. తాము చెప్పిన పథకాలను అమలు చేయడంతో పాటు పేదల అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలను తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ కల్లూరు రమణారెడ్డి, పార్టీ మండల కన్వీనర్లు సీ ఎం బాషా, కో ఆప్షన్ సభ్యుడు అల్లా, ఎంపీటీసీలు ఇషాక్, గురప్ప, నాయకులు వసంతరాయలు, హబీబ్, రాజీవ్‌బాషా, రామ్మోహన్‌రెడ్డి, చాపాటి సాయి నారాయణరెడ్డి, నాయుడు, సుబ్రమణ్యం, సచివాలయ కన్వీనర్లు బాబు, రౌఫ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం

కాశినాయన : జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా శనివారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డి, జెడ్పీటీసీ సత్యనారాయణరెడ్డిలు మండలంలోని రెడ్డికొట్టాల, చెన్నవరం గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, సచివాలయ కన్వీనర్లు లక్ష్మీదేవి, రామకృష్ణారెడ్డి, మాబు, బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు

రాజుపాళెం : పార్టీలకతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలను అందిస్తున్నామని గాదెగూడూరు సర్పంచ్ పోలా వరలక్ష్మి అన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని గాదెగూడూరు గ్రామంలో ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లను అతికించి, సర్వే చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పోలా వెంకటరెడ్డి, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అభివృద్ధే జగనన్న లక్ష్యం

బి.కోడూరు : రాష్ట్ర ప్రజల అభివృద్ధే జగనన్న లక్ష్యమని మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని మూలవారిపల్లె గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీనరసారెడ్డి, ఉప సర్పంచ్ శివారెడ్డి, వాటర్‌షెడ్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, గృహసారథులు వెంకటసుబ్బారెడ్డి, సిద్ధారెడ్డి, కె.వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

అనూహ్య స్పందన

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీతోపాటు మండల పరిధిలో జరుగుతున్న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. మున్సిపాలిటీ పరిధిలోని 23 సచివాలయాల పరిధిలో, మండల పరిధిలోని 10 సచివాలయాల పరిధిలో శనివారం ఆయా వార్డుల, పంచాయతీల ఇన్‌చార్జిలు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి గత ప్రభుత్వ హయాంలో పాలన, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో పాలన మధ్య తేడాలను వివరిస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో ఆయా వార్డుల కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

గోపవరంలో..

గోపవరం : జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. రెండవ రోజు శనివారం మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి జగనన్న నాలుగేళ్ల పాలన, ఇప్పటి వరకు అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఇంటి యజమాని అనుమతితోనే వారి ఇళ్లకు స్టిక్కర్లు అతికించారు. మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గోపవరం మల్లికార్జునరెడ్డి, మాజీ ఎంపీపీ సరస్వతమ్మ, సచివాలయాల మండల కన్వీనర్ పుల్లయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

నేడు చిన్నగోపవరంలో ఉచిత కంటి వైద్యశిబిరం

గోపవరం : వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ స్థానిక నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం చిన్నగోపవరంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నారు. నెల్లూరుకు చెందిన బీరం కంటి వైద్యశాల ఆధ్వర్యంలో డాక్టర్ బీరం రాజేంద్రరెడ్డి శిబిరంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. చిన్నగోపవరం సచివాలయం వద్ద ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

రేపు ఖాదర్‌పల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం

చాపాడు : మండలంలోని పల్లవోలు గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి రాజేష్ కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే వైద్య శిబిరంలో అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేస్తామన్నారు.


వైభవంగా సీతారాముల కల్యాణం

అట్లూరు : మండల పరిధిలోని తంబళ్లగొంది ఎస్సీకాలనీలో శనివారం సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కాలనీవాసులు వైభవంగా నిర్వహించారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని ప్రతిరోజు పలు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం వేదపండితులచే కల్యాణం నిర్వహించారు. అనంతరం వచ్చిన భక్తులకు అదే కాలనీకి చెందిన మద్దూరి బ్రదర్స్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నాడు-నేడు పనులను పూర్తి చేయాలని సూచన

బద్వేలు: పోరుమామిళ్ల పట్టణంలోని స్టార్ పాఠశాల వీధిలో ఉన్న ఉర్దూ పాఠశాలలో నాడు-నేడు పనులను త్వరగా పూర్తి చేయాలని వైస్ ఎంపీపీ సి. బాషా అధికారులకు సూచించారు. శనివారం ఆయన స్థానిక ఎంపీటీసీ ఇషాక్‌తో కలిసి పాఠశాలను పరిశీలించారు. అనంతరం ఇంజినీరింగ్ శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి నాడు-నేడు పనులు వేగంగా పూర్తి చేసి విద్యార్థులకు అసౌకర్యాలను తొలగించాలని కోరారు. రాగి జావ నాణ్యతను పరిశీలించారు.

పెద్దమ్మకు చల్ల


పెద్దమ్మ తల్లికి పూజలు చేసేందుకు తప్పెట్లతో వెళుతున్న మహిళలు, ప్రజలు

రాజుపాళెం : మండలంలోని వాసుదేవాపురం గ్రామంలో శనివారం పెద్దమ్మ తల్లికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి చల్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ఆలయాలకు డప్పు వాయిద్యాలతో మహిళలు వెళ్లి కాయా కర్పూరం సమర్పించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. ఆ తల్లిని శాంతం (సల్ల) చేశామని, అక్కడకు వచ్చిన భక్తులకు ప్రసాదాన్ని పంచిపెట్టారు. ఆదివారం గ్రామంలోని మహిళలు పెద్దసంఖ్యలో బోనాలు సమర్పించి పెద్దమ్మ జాతరను ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లెలో కొలువైన స్వయంభు శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో చైత్రమాసం మూడవ శనివారం స్వాతినక్షత్రం సందర్భంగా వేకువజాము నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం స్వామివారిని డ్రైఫ్రూట్స్‌తో అలంకరించారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారి పెంచలయ్యస్వామి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

గర్భిణులకు ఐరన్ ఫోలిక్‌యాసిడ్ మాత్రలు తప్పనిసరి

బద్వేలు అర్బన్ : ఆయా అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులకు పౌష్టికాహారంతో ఐరన్ ఫోలిక్‌యాసిడ్ మాత్రలను తప్పనిసరిగా అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై.చంద్రహాసరెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని పలు అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించిన ఆయన ఆయా కేంద్రాల్లో గర్భిణులకు అందుతున్న పౌష్టికాహారం, ఐరన్ ఫోలిక్‌యాసిడ్ మాత్రల పంపిణీ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులలో రక్తహీనతను తగ్గించడానికి, ఎముకలు దృఢంగా, ఆరోగ్యంగా ఉండటానికి ఐరన్ ఫోలిక్‌యాసిడ్ మాత్రలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం సురేంద్రనగర్, అబ్బిరాతివీధి అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నపిల్లల వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో హెల్త్‌ఎడ్యుకేటర్ వెంగయ్య, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి

రాజుపాళెం : అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన గర్భిణులు, బాలింతలు, పిల్లలకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శాంతికళ అన్నారు. మండలంలోని వెంగళాయపల్లె, గాదెగూడూరు, రాజుపాళెం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం ఆమె తనిఖీ చేశారు. కేంద్రాల్లోని రికార్డులను ఆమె పరిశీలించారు. గర్భిణులకు సరైన సమయంలో టీకాలు, ఐరన్ మాత్రలు ఇస్తున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు టీకాలు ఇచ్చే సమయంలో అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మంజుల, ఎంపీహెచ్‌ఈఓ శివశంకర్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, ఏఎన్‌ఎంలు లక్ష్మీదేవి, రజియ, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక కొర్రపాడు రోడ్డులోని కొనిరెడ్డి ఫౌండేషన్ కార్యాలయంలో శనివారం ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల పోస్టర్లను కొనిరెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో ఈనెల 9, 10 తేదీలలో 48 గంటల పాటు శ్రీశ్రీ కళావేదిక, ఇంద్రాణి చారిటబుల్ ట్రస్టు సంయుక్తంగా ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సాహితీ బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి దస్తగిరి, వార్డు మెంబర్ బండెల మోష, చంద్రబాబు రెడ్డి, ఓబులేసు పాల్గొన్నారు.

గడువులోగా మున్సిపల్ మార్కెట్ నిర్మాణం పూర్తి

ప్రొద్దుటూరు : శివాలయం ఎదురుగా నిర్మిస్తున్న నూతన కూరగాయల మార్కెట్‌ను గడువులోగా పూర్తి చేస్తామని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి తెలిపారు. రూ.53 కోట్లతో జరుగుతున్న మార్కెట్ నిర్మాణ పనులను శనివారం ఉదయం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ మాట్లాడుతూ గత ఏడాది నవంబర్ నెలలో మార్కెట్ నిర్మాణ పనులను ప్రారంభించామని, గడువులోగా నిర్మాణ పనులను పూర్తి చేసి వ్యాపారులకు అప్పగిస్తామన్నారు. ఆయన వెంట 11వ వార్డు ఇన్‌చార్జి కసిరెడ్డి మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోను మూసేయాలనే ప్రయత్నం మానుకోండి

మైదుకూరు : మైదుకూరులోని ఆర్టీసీ డిపోను మూసివేయాలనే ప్రయత్నాన్ని ప్రభుత్వం మానుకోవాలని సీపీఐ, అనుబంధ సంఘాల నాయకులు కోరారు. శనివారం వారు మైదుకూరులో విలేకరులతో మాట్లాడుతూ రాయలసీమ ప్రధాన కూడలి కేంద్రంగా ఉన్న మైదుకూరులో ఆర్టీసీ బస్టాండు రోజూ వేలాది మంది ప్రయాణికులను గమ్యం చేరుస్తోందన్నారు. దానికి అనుసంధానంగా ఉండి ప్రయాణికులకు అందుబాటులో బస్సులను నడుపుతున్న డిపోను ఎత్తివేసేందుకు అధికారులు పావులు కదుపుతున్నారని సీపీఐ నాయకులు పి.శ్రీరాములు, ఏవీ శివరామ్, షావలి, ఐఏఎల్ నాయకుడు ఎస్.సుబ్బారావు ఆరోపించారు. ఇప్పటికే డిపో నుంచి 20 బస్ సర్వీసులను ఇతర డిపోలకు తరలించారని, ఇప్పుడు మరో 14 సర్వీసులను తరలించడానికి అధికారులు సిద్ధపడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే సర్వీసుల తరలింపు చర్యలను విరమించుకోవాలని, లేదంటే సీపీఐ ఆధ్వర్యంలో ప్రజా సంఘాలు ఆందోళన చేపడతాయని తెలిపారు.

ఏఎస్పీకి సన్మానం

చాపాడు : అదనపు ఏఎస్పీగా విధులు నిర్వహిస్తున్న సోమాపురం పంచాయతీలోని శ్రీరామ్ నగర్‌కు చెందిన అశోక్‌ను శనివారం మండల పరిధిలోని నాగాయపల్లె గ్రామస్తులు సన్మానించారు. గ్రామానికి వచ్చిన సందర్భంగా నూతనంగా నిర్మించిన దేవాలయానికి ఏఎస్పీని ఆహ్వానించి ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, మాజీ ఎంపీపీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రన్ ఫర్ జీసెస్ కార్యక్రమం ప్రారంభం

ప్రొద్దుటూరు : ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని క్రైస్తవులు శనివారం ఉదయం రన్ ఫర్ జీసెస్ కార్యక్రమన్ని నిర్వహించారు. రామేశ్వరం మోరీల వద్ద నుంచి మైదుకూరు రోడ్డులోని ఎస్‌పీజీ చర్చి వరకు జరిగిన ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి కాగడా వెలిగించి ప్రారంభించారు. స్నూకర్ భాస్కర్, పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

శ్లోకం పఠించే యంత్రం వితరణ

రాజుపాళెం : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాలలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ స్వాముల ఆలయాలకు గంట గంటకు శ్లోకం పఠించే యంత్రాన్ని వితరణగా ఇచ్చినట్లు ఆలయ చైర్మన్ కానాల విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కానాల బలరామిరెడ్డి శనివారం తెలిపారు. ఆ యంత్రాన్ని కుమ్మరపల్లెకు చెందిన ఎన్.రామమునిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు ఇచ్చాడు.

వేసవిలో దాహార్తి తీర్చడం అభినందనీయం


రస్నా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాదరెడ్డి

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : వేసవిలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలు, ప్రయాణికుల దాహార్తిని తీర్చడం అభినందనీయమని ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాదరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మైదుకూరు రోడ్డులోని అన్వర్ హాల్ సమీపంలో శనివారం కొనిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కొనిరెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి మాట్లాడుతూ 8 ఏళ్లుగా వేసవిలో చలివేంద్రాల ఏర్పాటుతో పాటు పలు సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. చలివేంద్రం ప్రారంభం సందర్భంగా అందరికి రస్నా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, కొనిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.